# అపవాదిని ఎదిరించుటలో చేయవలసినవి చేయకూడనివి (4:15-31)

అపవాది మనలను నశింపచేయబూనిన సమయాల్లో, మనం చేయవలసిన వాటినిగూర్చి - నాల్గు హితోపదేశాలు యివ్వబడ్డాయి: (1) ఆశ్చర్యపడవద్దు (2)నిరాశచెందవద్దు (3) సాతాను చట్టాలను అనుసరించి నడువవద్దు (4) నిన్నుగూర్చి నీవు మరచిపో - అనేవి. సంఘం మీదికి వచ్చిన తొలి హింసనుగూర్చి మన పఠనాన్ని ముగించక మునుపు, లేఖనాల్లోనుండి యింకా కొన్ని హితోపదేశాలను చూద్దాం.

## అపవాది మర్యాదగా ఆడతాడని ఎదురుచూడకు (4:15-17)

తన పక్షంగా చెప్పవలసినదేదో పేతురు చెప్పిన తరువాత సభవారు నిశ్చేష్టులై నిలిచారు. సిగ్గునొందిన నిశబ్దం, అంతరంగ సమావేశాన్ని గూర్చిన ఒకరి సలహాతో బ్రద్దలుకొట్టబడింది. ''అప్పుడు - సభ[1] వెలుపలికి పొండని వారికాజ్ఞాపించి తమలోతాము ఆలోచన'' చేయ మొదలుపెట్టారు (15 వ.).

వారు ఒకరితో ఒకరు ఆలోచన చేయబోయేది - మెస్సీయాను సిలువవేసిన ఘోరమైన పాపాన్ని ఎలా పోగొట్టుకోవాలనే కాబోలు. గతంలో పేతురుయొక్క శ్రోతలు అడిగినట్టు - ''మేమేమి చేయాలి?'' అని అడిగియుండవలసింది (2:37). తప్పులో నిలిచియుండడానికే వారాలోచిస్తున్నట్టున్నారు. వారు యేసును మెస్సీయాగా అంగీకరించితే, మరొక ప్రధాన యాజకుడు, వేరొక సభ ఉండబోతుంది. గనుక వారు అధికారం లేనివారు; ఉద్యోగాలు లేనివారై యుంటారు! వారి మార్గంలో అడ్డుగా నిలిచిన గర్వం, పరపక్షద్వేషం, అనుభవం అనే వాటిని అదిగమించి రావలసి యుంటుంది. ''భయంకరమైన తప్పును ఎలాదిద్దుకొందాం'' అనే దానికి బదులు, ''ఈ మనుష్యులను మనమేమి చేయుదము?'' అని అడుగుతున్నారు (16a వ.).

మూయబడిన తలుపుల లోపల మాత్రం యథార్థంగానే ఒప్పుకున్నారు: ''వారిచేత ప్రసిద్ధమైన సూచకక్రియ చేయబడి యున్నదని యెరూషలేములో కాపురమున్న వారికందరికి స్పష్టమే, అది జరుగలేదని చెప్పజాలము'' (16b వ.).

నేటి బూటకపు అద్భుతాలులా కాకుండ క్రొత్త నిబంధన నాటి అద్భుతాలు - అప్పటికప్పుడే, పరిపూర్ణంగా జరిగి, సందేహవాదిని[2] సహితం ఒప్పిస్తున్నాయి.

ఆ సభలోనివారికి ఆ మనుష్యుడు స్వస్థపరచబడిన సంగతి బాగా తెలుసు. గనుక పేతురు యోహానులయొక్క సాక్ష్యము సత్యమని వారికి తెలుసు. గనుక యేసు మృతులలోనుండి లేపబడిన సంగతి సత్యమేనని వారికి తెలుసు! అయినా, వారి ప్రశ్న యింకా ఏమంటే - ''ఈ మనుష్యులను మనమేమి చేతుము?'' అనేదే. వారికున్న ఒకే ఒక అక్కర. క్రైస్తవ్యం వ్యాపింపకుండ చేయడమే (17a వ.). ఇక్కడ వేషధారణ వ్యక్తీకరించబడింది! ''నైతిక ప్రశ్నలో చిక్కుబడినవారు ఒకరి ముఖాలను మరొకరు ఎలా చూచుకొంటారు. ఒకవేళ చూచుకోలేదేమో.''[3]

''గుర్తింపదగిన'' అద్భుతం సహితం హృదయ కాఠిన్యంగలవారిని మార్చలేక పోయింది గుర్తుంచుకో. ఆత్మ రోగుల ప్రపంచాన్ని సువార్తతో సంధించేటప్పుడు, మనకు యింకా ఎక్కువైన ''అద్భుతాలు''ండాలని కొందరంటారు. అద్భుతాలు రక్షణకు దేవుని శక్తికాదు సుమీ; సువార్తయే ఆ శక్తి (రోమా 1:16)! మనకు ఎక్కువ అద్భుతాలు అవసరంలేదు. మనకు ఎక్కువ సవార్త ప్రసంగాలు కావాలి!

దోషంలేని ఈ మనుష్యులకు ఏమిచేయాలో అనే సంగ్దిగ్దాన్ని గూర్చి ఆ సభవారు ఎంతసేపు ఆలోచించారో మనకు తెలియదు. చివరిగా, వారిలో ఒకనికి సలహా ఒకటి తట్టింది: ''ఇకమీదట ఈ నామమునుబట్టి యే మనుష్యునితోనైనను మాటలాడ కూడదని మనము వారిని బెదురుపెట్ట''వలెనని - అనుకున్నారు (17b వ.). పేతురు యోహానులు వారి యెదుట ధైర్యముగా మాటలాడినా, వారిని, తక్కిన అపొస్తలులను బెదురుపెట్టగలమని వారు యింకా నిరీక్షిస్తున్నారు. యేసు బంధింపబడినప్పుడు, కొద్ది కాలానికి ముందే, అపొస్తలులు భయపడి పారిపోలేదా? ''యేసు నామమునుబట్టి యికమీదట ఎవరితోను మాట్లాడకుండేలా బెదిరించడానికి ఆ మతనాయకులు నిర్ణయం తీసికొన్నారు.''

ఆ మాటలను కొద్దిసేపు ఆలోచించు: ''ఇకమీదట ఎవరితోను'' ''మీరు యేసు నామమునుబట్టి యెంతమాత్రమును మాటలాడ కూడదని'' పేతురు యోహానులకు ఆజ్ఞాపించనుద్దేశించారు (18 వ.). యేసు నామము బహిరంగంగాగాని, రహస్యంగా గాని నిషేదించాలని వారి మనస్సులో ఉంది వారి ప్లానేమంటే-ఎక్కడైనా, ఏ రూపంలోనైనా, ఏ సమయంలోనైనా, ఏ స్థలంలోనైనా, ఎవనితోనైనా యేసు నామమున మాట్లాడటం మాన్పించాలనేదే! అపొస్తలులును, మిగిలిన క్రైస్తవులును ఈ చట్టానికి లోబడ్డారంటే ఇకమీదట భూమిమీద యేసు నామం మరెన్నడూ వినబడదు!

''కొంచెం ఆగు!'' అర్థరహితమైన అలాటి ఆజ్ఞను ఆ సభవారు చేసే హక్కులేదు! పేతురు యోహానులు ఏ చట్టాన్ని మీరినవారుకాదు. గనుక శిక్షార్హులు కాదు. ఆ

సభవారు సంకల్పించింది న్యాయంకాదని నీవు ఆక్షేపణ చేయడానికి సిద్ధంగా ఉండ వచ్చు. అపవాది న్యాయవంతుడని ఎవరన్నారు? త్రోవతప్పిన[4] వారితో వ్యవహరించడం చాలా కష్టం.

సాతాను నిన్ను కష్టపెట్టినప్పుడు, న్యాయంగా నడుచుకొనకపోతే, నీవు ఆశ్చర్యపడ నవసరంలేదు. అది వాని స్వభావం వాడు మార్గం తప్పుతాడని నీవు ఎదురు చూడవచ్చు. వాని మాదిరిని అనుసరింపకుండునట్లు జాగ్రత్తపడు! (వాని రూలు ప్రకారం ఆడవద్దు అనే సంగతి - జ్ఞాపకం చేసికో)!

## కొద్దిగానైనా అపవాదితో కలిసిపోకు (4:18-22)

సభవారు పేతురు యోహానులను తిరిగి వారుకూడియున్న స్థలానికి పిలిచి యుంటారు. ''అప్పుడు వారిని పిలిపించి - మీరు యేసు నామమునుబట్టి యెంత మాత్రమును మాటలాడకూడదు, బోధింపనుకూడదని వారి కాజ్ఞాపించిరి'' (18 వ.). పరిస్థితి యొక్క భయంకరత్వాన్ని తక్కువగా అంచనా వేయనవసరంలేదు. దేశంలో అత్యున్నతమైన కోర్టు తన తీర్మానాన్ని జారీచేసింది. ఇశ్రాయేలు దేశంలో బలమైన శాసనసభ చట్టాన్ని రూపొందించింది. యేసు నామమున బోధించడంగాని, మాట్లాడడంగాని చట్ట విరుద్ధంగా చేయబడింది!

కూడికలు చట్ట విరుద్ధమని ఆ సభ తీర్మానించలేదు గుర్తుంచుకో. పాడడం, ప్రార్థించడం చట్ట విరుద్ధమనలేదు. సత్ క్రియలు చేయడం చట్ట విరుద్ధమనలేదు. కేవలం యేసు నామమునుబట్టి మాటలాడడం బోధించడమే చట్ట విరుద్ధంగా చేయ బడింది. అపవాదికి సువార్త అంటేనే భయం! మనం కూడడమో, మన కుటుంబాలకు తరగతులు, వగైరాలు ఏర్పాటు చేసికొనడమో వాడికి అభ్యంతరంలేదు. (యేసు నామాన్ని నొక్కి చెప్పనంత కాలం)[5] మన ధర్మకార్యాలు, వగైరాలవలన వానికి తొందర కలుగదు కాని మనము ''రాజమార్గములలోనికిని కంచెలలోనికిని వెళ్లి'' (లూకా 14:23), క్రీస్తు నొద్దకు రమ్మని జనులను ఆహ్వానించుచున్నప్పుడు, అపవాది చెప్పశక్యం కానంత పిరికివాడైపోతాడు! అయితే విషాదకరమైన పరిస్థితి ఏమంటే- యేసు నామమున మాట్లాడకూడదని అపొస్తలులకు ఆజ్ఞాపింపబడవలసి వచ్చిందిగాని, మనకైతే యేసు నామమున ప్రకటించండని బోధించండని ఆజ్ఞాపింపవలసి వచ్చింది!

తిరిగి మరలా దీన్ని అడుగుతున్నా: ఒకవేళ అపొస్తలులు ఆ సభవారి ఆజ్ఞకు విధేయత చూపియున్నట్టయితే, ఏమైయుండేది? సంఘచరిత్రలో యిది ఎంతటి అపాయకరమైన సమయం? కట్టెలు వర్షానికి తడిచిన తరువాత వాటిని మండించడానికి నీవెప్పుడైనా ప్రయత్నించియుంటావా? సన్నటి మంట మండించావనుకో! చిదుగులో, గడ్డో - మొత్తానికి ఏదో ఒకటి ఉపయోగించి మంటను తయారుచేశావు.

ఆ మంటను ఆర్పడానికి ఎక్కువ ప్రయాస అవసరంలేదని మనకు తెలుసు. ఒక వాటెడు చెత్త రొల్లుకొచ్చి ఒక్కసారే దానిమీద పడవేసినా, ఆ మంట ఆరిపోవచ్చు. పేతురు యోహానులు సెన్‌హెడ్రిన్ ఎదుట నిలిచినప్పుడు కూడా, సంఘంయొక్క పరిస్థితి ఎప్పుడైనా ఆర్పివేయబడవచ్చునన్న మంటలావుంది[6] ఒకవేళ ఆ శాసనమే విధేయతను సమకూర్చుకో గలిగినట్టయితే, ప్రపంచపు చరిత్ర ఎలాగుండేదో![7]

అపవాదికి ఒక అంగుళమైన చోటివ్వకూడదని పేతురు యోహానులు తీర్మానించు కొన్నారు. నేను ఒకవేళ ఆ విధంగా ఆజ్ఞాపింపబడియున్నట్టయితే, ఆ ఆజ్ఞకు నేను లోబడడానికి యిష్టపడకపోయినా, నా ఉద్దేశాల విషయంలో నోరుగట్టిగా మూసికొని యుండేవాడనేమోకాని, అపొస్తలులు మాత్రం అలా చేయలేదు. ''మౌనం అంగీకార సూచన'' అని అంటారు. ''అందుకు పేతురును యోహానును వారిని చూచి దేవుని మాట వినుటకంటే మీ మాట వినుట దేవుని దృష్టికి న్యాయమా? మీరే చెప్పుడి;'' అని అన్నారు (19 వ.).

అపొస్తలులు యింతకు ఏమన్నట్టుందంటే - ''మీరు దేశానికి న్యాయధిపతులుగా భావించబడుతున్నారు. దీని విషయంలో తీర్పు చెప్పడానికి మీకు ఏ యిబ్బంది ఉండదు: ఇంతకు మేము మీకు లోబడాలా? లేక దేవునికే లోబడాలా? తిరిగి వారి ప్రశ్న సభవారిని సంధిగ్ధావస్తలో[8] ముంచివేసింది. జాతీయ మత సంబంధమైన ప్రతినిధులుగా, వారి సమాధానం చెప్పాలని వారికి తెలుసు. ''దేవునికి విధేయత'' అన్నిటికంటె ప్రథమస్థానంలో ఉండాలి. అయితే అధికారము, హోదా అనే వాటి యందు అక్కర కలిగియున్న ఆ నాయకులు, అపొస్తలులకు ప్రయోజనకరమైన సమాధానమివ్వడానికి సిద్ధపడలేదు.

సభవారు సమాధానం చెప్పినా చెప్పకపోయినా, పేతురు యోహానులు వారు చేయబోయే పనిని తీర్మానించుకొన్నారు ''మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక యుండలేమని వారికి ఉత్తరమిచ్చిరి'' (20 వ.)! విన్నవాటిని కన్నవాటిని చెప్పడమంటే సాక్ష్యమివ్వడమని ప్రాథమిక అర్థం. వారు ఆయనకు శిష్యులుగా ఉండేలా ప్రభువు వారిని నియమించారు (1:8); వారికి గత్యంతరంలేదు! సూర్యుడు ఉదయించ వద్దని, పక్షులు పాడవద్దని, తల్లులు తమ బిడ్డలను ప్రేమించవద్దని నీవు ఆజ్ఞాపించగలవేగాని, అపొస్తలులను మాత్రం యేసును[9] ప్రకటింపవద్దని ఆజ్ఞాపించలేవు! నీవుగాని, నేనుగాని యూదయ గలిలయ మార్గాల్లో యేసుతో కూడ నడిచిపోలేదుగాని, మత్తయి, మార్కు, లూక, యోహానుల్లో,[10] మనం ఆయనతో కాలం గడుపుతున్నాం అంతేకాదు, మన జీవితమార్గం గుండా పయనిస్తుండగా, ఆయన మన ప్రక్కనే ఉండి, మనలను బల పరుస్తున్నారు. అపొస్తలులవలెనే, మనం కూడా, ''యితరులకు యేసునుగూర్చి తెలపాలి. సువార్తను ప్రకటించడంలోను ఉపదేశించడంలోను ఆగలేము'' అని చెప్పగలిగియుండాలి.

వారు ''వీరిని గట్టిగా బెదిరించి విడుదలచేసిరి'' (21a వ.). అవి కేవలం పోసుకోలు బెదిరింపులుకావు, కొద్దికాలం తరువాతనే అపొస్తలులను బంధించి కొట్టారు (5:17-40). ఇంకా కొంతకాలం జరిగినప్పుడు స్తెఫనును చంపారుకూడా (6:8-7:60).

> ప్రజలందరు జరిగిన దానినిగూర్చి దేవుని మహిమపరచుచుండిరి గనుక సభవారు ప్రజలకు భయపడి, వీరిని శిక్షించు విధమేమియు కనుగొనలేక వీరిని గట్టిగా బెదిరించి విడుదల చేసిరి. స్వస్థపరచుట అను ఆ సూచకక్రియ ఎవని విషయములో చేయబడెనో వాడు నలుపది యేండ్లకంటె[11] ఎక్కువ వయస్సుగలవాడు (21-22వచ.).

ప్రజల దృష్టిలో, ఆ యిద్దరు అపొస్తలులు దేవునియొక్క ప్రత్యేకమైన సేవకులన్నట్టు నిలిచిపోయారు గనుక సభవారు వారిని ఏమీచేయ లేకపోయారు.[12]

## నీ బలాధారాలకు దగ్గరగా ఉండు (4:23-27)

23నుండి 31 వచనాలవరకు అపొస్తలుల బలాధారమేమో మనం కనుగొనగలం. నేడు మనం ఎక్కువగా, సువార్తికుల సహాయంమీదను, సంఘకట్టడాలమీదను, క్రైస్తవ కళాశాలలు, విశ్వవిద్యాలయాల మీద ఆధారపడుతూ ఉంటాం[13] ఆది సంఘానికి యివి ఏవీ లేవు. అయితే ఆనాటి క్రైస్తవులకు ఏముంది? ఒకరితో ఒకరు బలంగా బంధింపబడ్డారు; వారు ఏకంగా దేవునితో బంధింపబడ్డారు!

సభవారు పేతురు యోహానులను విడుదలచేసినప్పుడు, వారు నేరుగా క్రీస్తునందున్న తమ సహోదరులను వెదుకుతూ వెళ్ళారు. ''వారు విడుదల నొంది తమ స్వజనుల యొద్దకు వచ్చి, ప్రధానయాజకులును పెద్దలును తమతో చెప్పిన మాటలనన్నిటిని వారికి తెలిపిరి'' (23 వ.). ఆది భాషలో ''తమ సొంతవారు'' అని ఉంది. అంటే, వారు తక్కిన అపొస్తలుల యొద్దకు వెళ్ళారని నేను నమ్ముతున్నాను. (1) ఇంతవరకు అపొస్తలులే బోధించడంగాని, ఉపదేశించడంగాని జరిగిస్తున్నారు. అందువలన ఆ సభవారి బెదిరింపులు నేరుగా వారికే చెందాయి. (2) ప్రార్థించినవారు శక్తికొరకును, ధైర్యంగా ప్రకటించడానికిని అడిగారు (4:29-30). ఇప్పటివరకు అది అపొస్తలులకే వర్తిస్తుంది. (3) వారు ప్రార్థించుచున్నప్పుడు, భూకంపం కలిగింది. అప్పుడు వారు పరిశుద్ధాత్మతో నింపబడ్డారు (4:31). దీని వెంటనే అపొస్తలులు శక్తి పొందినట్టు గుర్తింపబడింది (4:33; 5:12). (4) తమ కట్టడ మీరినందున సభవారు కొందరిని బంధించారు (5:28). అలా బంధింపబడినవారు అపొస్తలులే (5:18).

''తమ స్వజనమనేది'' ఎవరికైనా వర్తించనీ, సాతాను వారికి కష్టం కలిగించిన తరువాత పేతురు యోహానులు తిరిగి వారియొద్దకు వచ్చి చేరుకున్నారు. ప్రభువైన యేసుకు స్నేహితులు కావలసివచ్చాం; అలాగే అపొస్తలులకు, అలాగే మనలో ప్రతి

ఒక్కరికి. అందుకే దేవుడు సంఘాన్ని నిర్మించారు లేక ఏర్పాటు చేశారు. సమర్పించు కున్నవారి సహవాసంలోనుండి బలం పొందాలని దేవుడు మనకొరకు ఉద్దేశించారు. అపవాదియొక్క అగ్నిబాణాలకు నీవు సిద్ధంగా ఉంటే, క్రీస్తునందున్న నీ సహోదర సహోదరీలతో బలమైన బంధాలను ఏర్పరచుకో!

''నా కెవరూ అవసరంలేదు;'' నాయంతటనేనే చూచుకోగలనని ఎవ్వరైనా గప్పాలు కొట్టవచ్చు. నీకు నీ సహోదర సహోదరీలు అక్కరలేకపోతే, దాన్నిగూర్చి అతిశయించకు. నీవు జీవించుతున్న జీవిత విధానానికి ఎక్కువ ప్రోత్సాహం అక్కర లేకపోవచ్చు. కాని ప్రభువుకొరకు నీవు మండుతూ ఉంటే, అపవాది నీకు కష్టం కలిగించినప్పుడు, పేతురు యోహానులవలె, నీతోటి క్రైస్తవులను కలసికొనడానికి పరుగెత్తుతావ్!

24వ వచనంలో మనం చూస్తున్నట్టు, పేతురు యోహానులకు మరొక బలాధారముంది. అది దేవునికి మొర్రపెట్టడం. ''వారు విని, యేకమనస్సుతో దేవునికిట్లు బిగ్గరగా మొర్రపెట్టిరి'' (24a వ.). వారి స్థానంలో మనమే ఉంటే ఎవరి సహాయాన్ని కోరేవారమో; ఎవరి చుట్టు తిరుగుతూ ఉండేవారమో. మరి యింకా ఎలా భావించి, ప్రవర్తించి యుండేవారమో.

సాతాను మనలను కష్టపెట్టినప్పుడు, మన సహోదరులతో బలమైన సహవాస బంధాలు ఉండడం మాత్రమేగాకుండ, దేవునితో కూడ మనం అలాటి సంబంధాలను నెలకొల్పుకోవాలి. ''ప్రార్థన అనేది బాధ్యతనుండి తప్పించుకొనడం కాదుగాని, దేవుని సామర్థ్యానికి[14] అది మన సమాధానం మాత్రమే''.

24నుండి 30వ వచనంవరకు కార్యగ్రంథంలో దాఖలు చేయబడిన రెండవ ప్రార్థన ఉంది (యూదాకు బదులు మరొకని ఏర్పాటు చేసికొనే). గత ప్రార్థనలో, దేవుడు అందరి ''హృదయములను ఎరిగినవాడు'' (అనే సత్యం) నొక్కి చెప్పబడింది (1:24). ఈ ప్రార్థనలో[15] దేవునియొక్క ఏలుబడి (అనే సత్యం) నొక్కి చెప్పబడింది. అది యిలా ప్రారంభమయ్యింది: ''నాథా, నీవు ఆకాశమును భూమిని సముద్రమును వాటిలోని సమస్తమును కలుగజేసినవాడవు'' ''నాథా'' అనే పదం (***despotes***) అనే గ్రీకు పదంనుండి తర్జుమాచేయబడింది. "***despotes***'' అంటే, ''సర్వాధికారీ!'' అని భావం. ఎక్కువ తర్జుమాల్లో''సర్వాన్ని పాలించే ప్రభువా''[16] అని ఉంది. ఆయన అందరిని, అన్నిటిని కలుగజేసినవాడు మాత్రమే కాదు, అన్నిటిని (సెన్‌హెడ్రిన్‌తో సహ) పాలించువాడు కూడా!

ఆ తరువాత నాలుగు వచనాలతో అపొస్తలులు నిలిచియున్న పరిస్థితిమీద దేవుని స్వాధీనం నొక్కిచెప్పబడింది. మొట్టమొదట, లేఖనాలకు విన్నవించుకొనడం[17] జరిగింది.

అన్యజనులు ఏల అల్లరి[18] చేసిరి? ప్రజలెందుకు వ్యర్థమైన ఆలోచనలు పెట్టుకొనిరి?
ప్రభువుమీదను ఆయన క్రీస్తుమీదను భూరాజులు లేచిరి, అధికారులు ఏకముగా

> కూడుకొనిరి - అని నీవు పరిశుద్ధాత్మద్వారా మా తండ్రియు నీ సేవకుడునైన దావీదు నోట పలికించితివి (25-26 వచ.).[19]

అపొస్తలులు తమ సహోదరులకు, దేవునికి దగ్గరగా ఉండడం మాత్రమేగాక, లేఖనాలకు కూడా వారు దగ్గరగానే ఉన్నారు. (సామాన్యులకు పాత నిబంధన ప్రతులు అందుబాటులో ఉండవు గనుక) లేఖనాలు తెరచి చదివే అవకాశముండదు. అది కంఠత పెట్టియుండవలసిందే. అపవాదిని ఎదిరించడానికి నీవు సిద్ధపడి యున్నట్టయితే, శక్తికి మరొక మూలం దేవుని వాక్యం! చదువు; పఠించు; కంఠతపెట్టు!

ఈ కొటేషన్ కీర్తనలు 2లోనుండి తియ్యబడినది; రాజుకు తగిన గీతమిది.[20] గతించిపోయిన రాజుకు, వచ్చేరాజుకు మధ్యలో ఉన్నకాలాన్ని యివి సూచిస్తాయి. చుట్టునున్న రాజ్యాలవారు  ఇలాటి అవకాశాన్ని చూచుకొని, దేశంమీదికి దండెత్తుతారు.[21] ప్రభువుమీదను[22] ఆయన క్రీస్తుమీదను జనులు చేసే ప్రయత్నాలు వ్యర్థమౌతాయని ఈ కీర్తన ప్రకటించింది. అసలు, ఆయన క్రీస్తు (అభిషిక్తుడు) అనే పదం ఇశ్రాయేలు రాజును సూచించింది (1 సమూ. 26:9). కాని ''అభిషిక్తుని'' గూర్చి కీర్తనలో చెప్పబడిన సంగతిని ఏ మానవ రాజుకూడా నెరవేర్చలేకపోయాడు. అందువలన కీర్తనలు 2ను యూదులు - చివరిగా రాబోయే మెస్సీయాకు సంబంధించినట్టు గ్రహించారు.

ప్రభువైన యేసుకు సంబంధించిన వాటిని కీర్తనలు 2 చాయగా సూచిస్తుంది: ''నీవు అభిషేకించిన[23] నీ పరిశుద్ధ సేవకుడైన యేసునకు విరోధముగా హేరోదును పొంతి పిలాతును ఈ (యెరూషలేము) పట్టణమందు అన్యజనులతోను ఇశ్రాయేలు ప్రజలతోను నిజముగా కూడుకొనిరి'' (27-28 వచ.). తన అభిషిక్తునికి విరోధంగా నాలుగు రకాల జనులు కూడతారని దావీదు తెలియజేశాడు: రాజులు, అధిపతులు, అన్యజనులు, ''ప్రజలు'' ఈ నాల్గురకాలైన జనం యేసుకు విరోధంగా నిలిచారు. హేరోదు రాజు, పిలాతు అధిపతి, అన్యజనులు (రోమా) సైనికులు, ఇశ్రాయేలు ప్రజలు!

## దేవుని మీద ఆధారపడు (4:28-30)

ప్రార్థనయొక్క చివరి భాగంలో, అపొస్తలులు దేవునిపై ఆధారపడినట్టు తేటగా కనుపరచారు. దేవుడు సమస్తాన్ని తన స్వాధీనంలో ఉంచుకొన్నట్టు వారు నమ్మారు. 28వ వచనంలో ఈ నాల్గురకాలైన ప్రజలు - ''ఏవి జరుగవలెనని నీ హస్తమును నీ సంకల్పమును ముందు నిర్ణయించెనో, వాటినన్నిటిని చేయుటకై'' కోరుకున్నారు. ప్రతి సంభవంకూడా, దేవుని  ఉద్దేశంలో, ఆయన సంకల్పంలో భాగమైయుంది! (''వారు జరిగించినవాటిని జరిగించునట్టు దేవుడు వారిని బంవంతపెట్టలేదు గాని,

రక్షించు తన సంకల్పంలో, వారు యిష్టపడిచేసే కార్యాలను ఉపయోగించుకొనడానికి దేవుడు ఉద్దేశించారు.'')[24] అంటే, యెరూషలేములోని బలవంతులైన నాయకుల మూలంగా హింస ప్రారంభమయినా, దేవుని స్వాధీనంలో నుండి పరిస్థితి దాటిపోలేదు. సంభవించిన ప్రతిదీ దేవునియొక్క[25] ఆధీనాన్ని రుజువుచేస్తుంది! సాతాను మనలను శ్రమపెట్టే సమయంలో, ప్రతిదీ స్వాధీనం తప్పినట్టు కన్పించేటప్పుడు, - కీడులోనుండి మేలు రప్పించేలా మనం ఆరాధించే దేవుడు సమస్తాన్ని తన స్వాధీనంలో ఉంచుకొన్న సంగతిని జ్ఞాపకం చేసికోవాలి (రోమా. 8:28)!

29-30వచనాల్లో అపొస్తలులయొక్క విన్నపం ఉంది. ప్రార్థనలో ఈ స్థలానికి వచ్చినప్పుడు నేను ఆగి ఆలోచిస్తూవుంటాను: ''దేవుడు సర్వశక్తుడై సమస్తాన్ని తన స్వాధీనంలో ఉంచుకొన్నాడని ఎరిగి, నేనే వారిలో ఒకడనైయుంటే, ఆయనను నేనేమడిగేవాడనో?''[26] క్రీస్తుకు విరోధులైన వారిని శిక్షించుమని నేనడిగేవాడనే. హింసను నిలిపివేయుమని ప్రార్థించేవాడనే. ఒకవేళ హింసకొనసాగినట్టయితే, కనీసం ఆయన కాపుదలకొరకైనా వేడుకునేవాడనే. అపొస్తలులైతే, వీటిలో దేనిని అడుగలేదు. గాని వారడిగిందేమంటే:

> ప్రభువా, ఈ సమయమందు వారి బెదిరింపులు చూచి రోగులను స్వస్థపరుచుటకును, నీ పరిశుద్ధ సేవకుడైన[27] యేసు నామము ద్వారా సూచక క్రియలను మహత్కార్యములను చేయుటకును నీ చెయ్యి చాచియుండగా, నీ దాసులు బహు ధైర్యముగా నీ వాక్యమును బోధించునట్లు అనుగ్రహించుము (29-30వచ.).

ఆ సభవారిని గూర్చియైతే, ''వారి బెదిరింపులను చూడుము'' మరోవిధంగా చెప్పాలంటే ''ప్రభువా ఈ విషయాన్ని మీ చేతులకే అప్పగిస్తున్నాం. ఈ మనుష్యులు చేసిన దానిని గుర్తించండి - మీ చిత్తం వచ్చినట్టు దాన్ని జరిగించండి.''

సాతాను మనలను శ్రమపెట్టే సమయంలో కోపించే, పగతీర్చుకొనే స్వభావాన్ని పెంచుకోకుండ జాగ్రత్తపడాలి. ''సమస్తమైన ద్వేషము, కోపము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి'' అని పౌలు హెచ్చరించాడు (4:31). పౌలు యింకా యిలా అన్నాడు:

> ప్రియులారా, మీకు మీరే పగతీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి - పగ తీర్చుట నా పని, నేనే ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది. కాబట్టి, నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము; ఆలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడువలన జయింపబడక, మేలు చేత కీడును జయించుము (రోమా 12:19-21).

నీవు లోతుగా గాయపరచబడినట్టయితే, దాన్ని ''గుర్తించుమని'' ప్రభువును వేడుకో ఆ తరువాత సంగతులను ఆయన చేతికి అప్పగించుకొని జీవితంలో యిక

ముందుకు సాగిపోతూ ఉండు!

సభవారు వారికేమి చేశారో దాన్నిగూర్చి అపొస్తలులు అక్కర కలిగియుండలేదు - లేక ఆ సభవారు యింకా ఏమిచేయబోతారనే విషయాన్ని కూడా వారు పట్టించుకోలేదు - లేక వారి సవ్వాలుకు వీరు చాలతారా లేదా అనే సంగతినికూడా మనస్కరించలేదు. శ్రమనుండి తప్పించుకోవాలని సహితం వారు కోరలేదు, కాని సేవచేయడానికి శక్తిని ప్రసాదించుమని వారు వేడుకొన్నారు. భయపడకుండ చేయమనికూడా వారు ప్రభువును అడుగులేదు. ఆయన వాక్యం బోధించడానికి ధైర్యం, ఆయన చిత్తాన్ని జరిగించడానికి శక్తి నను గ్రహించుమని వారు కోరారు.

## నీకు అవసరమైన శక్తిని దేవుడు ప్రసాదిస్తారని నమ్ము (4:31)

వారు ఊహించిన దానికంటె ముందే సమాధానం వచ్చింది! ''వారు ప్రార్థనచేయగానే వారు కూడియున్నచోటు[28] కంపించెను; అప్పుడు వారందరు పరిశుద్ధాత్మతో నిండినవారై దేవుని వాక్యమును ధైర్యముగా బోధించిరి'' (31 వ.). ఇది మరియొక పెంతెకొస్తు[29] కాదు. కాని, దేవుడు తమతోకూడ ఉన్నట్టు ఆయన వారికిచ్చిన స్పష్టమైన సంఘటనయే అది. ఇలాగే ఆయన (అపొ. 16) లో చెరసాలను అదే సందేశమివ్వడానికి కదిలించివేశారు. ''పరిశుద్ధాత్మతో నింపబడ్డారనే''[30] సంగతి 8వ వచనంలో కన్పించే సంగతి వంటిదే కావచ్చు. 8వ వచనంలో పేతురు పరిశుద్ధాత్మతో నిండుకొని సభవారి యెదుట మాట్లాడాడు. (పేతురు నింపబడినట్టే) ఇప్పుడు వారు (అపొస్తలులు) కూడా పరిశుద్ధాత్మతో నింపబడి (పేతురు మాట్లాడినట్టే 13 వ.), ధైర్యంగా వాక్యాన్ని బోధించారు. సభవారు యేసు నామమునుబట్టి మాట్లాడకూడదని కేవలం యిద్దరు మనుష్యులకే ఆజ్ఞాపించారు. ఇద్దరిని నోరు మూయించడానికి మారుగా, పన్నిద్దరు మనుష్యులను ఆ నామమున స్వస్థపరచడానికిని, ఆయన నామమును ప్రకటించడానికిని సభవారి బెదిరింపులు రెచ్చగొట్టాయి! ''ఇదియుగాక అపొస్తలులు బహు బలముగా ప్రభువైన యేసు పునరుత్థానమును గూర్చి సాక్ష్యమిచ్చిరి'' (4:33). ''ప్రజలమధ్య అనేకమైన సూచక క్రియలను మహాత్కార్యములును అపొస్తలులచేత చేయబడుచుండెను'' (5:12)!

ప్రభువైన యేసు తన అపొస్తలులకు చేసిన వాగ్దానాలన్నిటిని మనకు చేయలేదు. మనం కూడియున్న యింటిని దేవుడు ఊగించబోవడం లేదు; లేదా ఆత్మ ప్రేరేపణతో మాట్లాడేలా ఆయన మనకు శక్తిని అనుగ్రహించబోయేది లేదు. అంటే దానికి అర్థం దేవుడు మనలను శక్తిహీనులనుగా చేశాడని కాదు. ఆయన మనతో ఉండడానికి వాగ్దానం చేశారు (హెబ్రీ. 13:5b-6). మనకు సహాయం చేయడానికి ఆయన తన ఆత్మను మనకనుగ్రహించారు (అపొ. 2:38). మనలో ''కార్య సాధనమగు తన శక్తిని'' ఉంచారు (ఎఫెసీ. 3:20). మన మార్గంలో శోధనలు లేక శ్రమలు వస్తే

వాటిని మనము సహించునట్లు, ‘‘తప్పించుకొనే మార్గాన్ని’’ యిస్తారు (1 కొరింథీ. 10:13). ఆయన మన కూడిక స్థలాలను కంపింపచేయకపోవచ్చు గాని; ఆయన మన కూడికలను కంపింపచేయగలరు.[31] అలా, మనంకూడా ధైర్యంగా వాక్యాన్ని బోధింపవచ్చు.

## ముగింపు

అపొస్తలుల నోళ్లు మూయించాలని అపవాది ప్రయత్నించి విఫలుడయ్యాడు. మనలోను కూడా నోళ్లు మూయించడానికి అపవాది సకల విధాలా ప్రయత్నిస్తున్నాడు. మన లేఖనభాగంలోనుండి చెప్పబడిన హితోపదేశాలను మనం అనుసరించి, దేవునికి సమీపంగా మనం నడుచుకొన్నట్లయితే, మన విషయంలో కూడా అపవాది విఫలుడౌతాడు. ‘‘కాబట్టి దేవునికి లోబడియుండుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపోవును’’ (యాకోబు 4:7).

అపవాది మనలను అంత తేలికగా వదలిపెట్టడనుకో, లోపలనుండి, వెలుపలనుండి సంఘాన్ని నాశనం చేయడానికి తిరిగి అపవాది ఎలా ప్రయత్నించాడో 5వ అధ్యాయంలో చూద్దాం. అయినా, అపవాది నిన్ను అంత తేలికగా వదలడు. తిరిగి యాకోబు 4:7ను చూడు. నీవు అపవాదిని ఎదిరించాలంటే, ముందు దేవునికి లోబడాలి. నీ సొంత శక్తితో అపవాదిని ఎదిరించలేవు. నీకు దేవుని సహాయం కావాలి! ఒకవేళ నీ జీవితాన్ని ప్రభువునకు అప్పగించుకొనకపోతే, వెంటనే ఆ పని జరిగించు!

---

సూచనలు

[1]సన్హెడ్రిన్ అని గ్రీకులో ఉన్నదానికి సభ అన్నారు NIVలో అలాగే తర్జుమా చేయబడింది. [2]ఆ భిక్షగాని సందర్భంలో వాని స్వస్థత - అప్పటికప్పుడే (3:7); పరిపూర్ణంగా (4:10) ఒప్పంపబడింది (4:16). [3]J. W. McGarvey, *New Commentary on Acts of Apostle*, vol. 1 (Delight, Ark.: Gospel Light Publishing Co., n. d.), 73. [4]త్రోవతప్పిన మనుష్యులు - యితరులనుకూడా త్రోవ తప్పించడానికి ప్రయత్నిస్తారు. [5]కాలం జరిగేకొలది, స్థానిక సంఘం - తన వ్యక్తిగత అవసరతలను తీర్చుకొనడానికి ప్రయత్నిస్తుందేగాని, సువార్త ప్రకటనకు అంత శ్రద్ధచూపదు. ఇది అపవాది పనికి పరిపూర్ణంగా సరిపోతుంది. అనేక స్థానిక సంఘాల పనులు వానికి ఎలాటి అంతరాయాన్ని కలిగించవు! [6]క్రొత్తగా జన్మించిన శిశువు ఎంత బలహీనంగా ఉంటాడో అనే ఉదాహరణను కూడా ఉపయోగింపవచ్చు. [7]ఆ శాసనానికే వారు విధేయత చూపి ఉన్నట్లయితే, ఎలాగుండేదో? అని నేను క్లాసులో అడిగితే, ‘‘ఈ రాత్రి మనం యిక్కడకూడి ఈ సంగతులను చదివియుండే వారంకాదు’’ అని ఒకవ్యక్తి సమాధానమిచ్చాడు. [8]వీరు ప్రభువును చిక్కించుకోవాలని ప్రయత్నించినప్పుడు, ప్రభువు వీరిని సంగ్దిద్దావస్థలో ముంచుతూ ఉండేవారు. ఇలాటి పరిస్థితిలో ప్రభువుయొక్క జీవితంనుండి మత్తయి 21:24-27 చూడు. [9]ఈ భావన Richard Rogers, “The First Opposition’’ అనే ప్రసంగంనుండి తీసికొనబడిందని. [10].Ibid.

[11] అతని వయస్సు ప్రత్యేకంగా చూపబడిన కారణం (1) చాలకాలంగా ·భిక్షగాడై అందరికి ఎరుకైనవాడనడానికిని (2) ప్రకృతి సిద్ధంగా అతని అవయవాలు పెరిగే అవకాశం లేదని, అందువలన అద్భుతం నిరాక్షేపమైనదనడానికి సరిపోతుంది. [12]–పేతురు యోహానులను ఆ సభవారు భయపెట్టజూచియు, ఏమిచేయలేకపోయారుగాని, ప్రజలు వారిని గుర్తించిన తీరును చూచి సభవారే జనులకు జడిచారు. [13]ఇది కేవలం తప్పుని భావంకాదు - వాటిని వాటి సరియైన దృక్పదంతో చూడగలగాలి. వాటి స్థానంలో వాటిని నిలపాలి. [14]Warren W. Wiersbe, *The Bible*

*Exposition Commentary,* vol. 1 (Wheaton, Ill.: Victor Books, 1989), 416. [15] ప్రార్థన అనేది ప్రత్యుత్తరం లేక జవాబు అయ్యుండాలి గాని, ఆచార కర్మకాండాలా ఉండకూడదు. ఒకే రకమైన పదాలు మాటిమాటికి వల్లించకుండ జాగ్రత్తగా ఉండు. సందర్భానికి తగినట్టు నీ ప్రార్థన ఉండనివ్వు. [16]NIV, RSV, etc. తక్కిన తర్జుమాలలో "Master" (Goodspeed), "Ruler of all" (Knox), ''సర్వశక్తుడవగు దేవా'' (Norlie). [17]ప్రార్థనలో లేఖనాలు ఉపయోగించిన సందర్భం యిది ఒకటి - అయితే ప్రార్థనను ప్రసంగంగా ఉపయోగించుకోకుండ జాగ్రత్తపడాలి. [18]అల్లరి (Rage) అనే పదం - పోకిరి గుర్రం ఎదురు తిరిగినా, కళ్లెంయొక్క క్రమశిక్షణకు లొంగిన దానికి యిది ఉపయోగించబడుతుంది. [19]దైవప్రేరేపణకు యిదొక ఉదాహరణ. 25వ వచనంలోని పదప్రయోగం ఆదిభాషలో తారుమారుగా ఉన్నట్టు అనేకమంది వ్యాఖ్యానకర్తలంటారు - అయితే అర్థం తేటగానే ఉంది. [20]"Royal Psalms" (రాజునకు తగిన కీర్తనలు) అని ఇశ్రాయేలు రాజ్యసింహాసనానికి సంబంధించిన వాటిని అంటారు. తమ క్రొత్త రాజులకు అభిషేకించే సందర్భంలో యూదులు ఈ కీర్తనలనుపయోగిస్తారు.

[21] దావీదు ఇశ్రాయేలీయులందరి మీద రాజుగా అభిషేకింపబడిన సందర్భంలో, ఫిలిష్తీయులు వారిపై దండెత్తారు. [22]దేవుని అభిషిక్తుని మీద చేసిన తిరుగుబాటు దేవునిమీద చేసినట్టేనని ఈ కీర్తన ప్రకటించింది. దేవునిమీదనే ఒకడు సవ్వాలు చేశాడంటే - వాడు నాశనమవ్వడానికి సిద్ధపడినట్టే - అంతేగాక వారిని ఎదిరించడం, తమ క్రీస్తును ఎదిరించినట్టుగానే అపొస్తలులు భావించారు. గనుక వారిని ఎదిరించినవారు పతనమయ్యేది ఖాయం! [23]ఇశ్రాయేలు రాజులు తైలంతో అభిషేకింపబడేవారుకాని, దేవుడు తన క్రీస్తును పరిశుద్ధాత్మచేత అభిషేకించారు (మత్తయి 3:16-17; అపొ. 10:37-38). [24]Lewis Foster, notes on Acts, *The NIV Study Bible* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 1651. [25] అపొ. 2:23పై నోట్సులో చూడు. [26] నీవు క్లాసు బోధించుతూ, ఈ సమాచారాన్ని ఉపయోగిస్తూ, మీ క్లాసులో ఒకని నీవు ఈ ప్రశ్న అడుగవచ్చు. [27] దావీదును సేవకుడని, యేసును పరిశుద్ధ సేవకుడని అపొస్తలులు సంబోధించారు గాని, తమ్మునుగూర్చియైతే ''దాసులు'' (బానిసలని) పరిచయం చేసికొన్నారు. [28] కొందరు ఈ స్థలాన్ని మేడగదియని ఊహించారు (1:13). అది దేవాలయమునొద్ద- సొలొమోను మంటపంగాని, దాని సమీపంలో ఏదో ఒక యిల్లుకావచ్చు (5:12). అసలు స్థలం ఎక్కడ అనేది మనకు సరిగా తెలియదు. [29] గతంలో మనం గుర్తించినట్టే, అపొ. 2లోనిది ఒక్కసారి సంభవమే. [30]''పరిశుద్ధాత్మతో నింపబడడమంటే'' - కేవలం ఆత్మస్వాధీనంలో ఉండడమనేదే భావం. ఈ స్థలంలో అపొస్తలులుతో పాటు యితరులుకూడా ఉన్నట్టయితే, ఎఫెసీ. 5:18లో ఉన్నట్టు - అద్భుత శక్తులతో నిమిత్తంలేని భావంతో ఉపయోగింపబడియుండవచ్చు - దేవుని చిత్తాన్ని జరిగించడానికి నీ జీవితాన్ని ఆయనకు సమర్పించుకొనుట ద్వారా (క్రొత్త నిబంధనలో బయలుపరచబడినట్టు) మనలను మనం ఆత్మయొక్క స్వాధీనం చేసికొన్నప్పుడు, ఆయన మన జీవితాలను నింపి, ఆత్మ ఫలాలు ఫలించేలా చేస్తారు (గలతీ. 5:22-23). ఈ సందర్భంలోనైతే, ధైర్యంతో వాక్యం బోధించడానికి ఆత్మయొక్క ప్రత్యక్షత అనుగ్రహింపబడింది. అంటే, ఈ లేఖనభాగం అపొస్తలులకు, క్రైస్తవులకు వర్తింపవచ్చునుగాని ఈ సందర్భంలో అది అపొస్తలులకు మాత్రమే వర్తిస్తుందని నేను నమ్ముతున్నాను. ఇంత పర్యంతము, హింస సమయంలో పేతురు, యోహానులే ధైర్యంగా వాక్యం బోధించినట్టు లూకా అన్నాడుగాని; అపొస్తలులందరు అదే పనిని జరిగించినట్టు యిప్పుడంటున్నాడు. [31]ఆయన సంఘ సభ్యులను కదిలించగలరు.